# గీత - పాలనాదక్షత - 4

- యేలూరిపాటి ఆంజనేయశర్మ

అర్జునుడు విషాదంతో ఇలా అన్నాడు "కృష్ణా యుద్ధానికి సిద్ధంగా ఉన్న నావాళ్ళందర్నీ (స్వజనం) చూసి నా అవయవాలు పట్లు తప్పుతున్నాయి. నోరెండుతోంది. శరీరం వణుకుతోంది. గగుర్పాటు కల్గుతోంది. గాండీవం చేజారుతోంది. దేహమంతా మండిపోతోంది. నిలబడే ఓపికలేదు. నామనస్సు తిరిగిపోతోంది.

'నిమిత్తాని చ పశ్యామి, విపరీతాని కేశవ

న చ శ్రేయో నుపశ్యామి హత్వాస్వజన మాహవే'

దుశ్శకునాలగపడుతున్నాయి. నావాళ్ళందర్నీ చంపటం శ్రేయస్కరం కాదనిపిస్తోంది." అంటున్నాడు.

ఇక్కడ అప్పజెప్పిన పని చేయలేనివాడు, చెయ్యాలనిలేనివాడు ఎలా మాట్లాడుతాడో అలాగే మాట్లాడాడు అర్జునుడు. చేయబోయే పనిమీద శ్రద్ధాసక్తులు లేనపుడు అన్నీ దుశ్శకునాలుగా అనిపించే ధోరణి అలవడుతుంది. పని కాదని అంతరాత్మ చెబుతున్నట్లు కూడ అనిపిస్తుంది. అదేపని చెయ్యాలని ఉన్నప్పుడు, ఈరకమైన శంకలు-కుశ్శంకలు బయలుదేరవు.

కాబట్టి ఏపని మొదలుపెట్టటానికైనా పూర్తి మానసిక సంసిద్ధత అవసరం. అపుడే ఎన్ని దుశ్శకునాలెదురైనా కొండను పిండి చేయగలమనే ఆత్మవిశ్వాసం పొంగిపొర్లుతుంది. బలహీన మనస్కులకే దుశ్శకునాలగుపడుతాయి. అథవా వాటిమీదికి దృష్టి పోతుంది. చేస్తున్న పని శ్రేయోదాయకం కాదేమో అనికూడా అనిపిస్తుంది. అదేపని ఉత్సాహ మొచ్చాక చేస్తే శ్రేయోదాయకంగా అగపడవచ్చు. కనుక విజయాలకు మొదట కావలసింది బలమైన మనస్సు. అచంచలమైన ఆలోచన. తనమీద తనకి నమ్మకం.

మరొకటి. ఈసందర్భంలో వాడిన "స్వజన" పదంలో అర్జునుడు కాస్తంత 'మన' - 'తన' తెలిసినవాడని సంతోషించినా, ధ్రుతరాష్ట్రునివంటి 'స్వ' లేదని ఆనందించినా, వ్యామోహం మాత్రం ఉందనిపిస్తోంది.

యుద్ధానికి సిద్ధమయ్యే వచ్చాడు కనుక, వచ్చేముందు వున్న మానసిక స్థితి దుష్టశిక్షణే. తీరా వచ్చాక 'నావాళ్ళు' అని గుర్తొచ్చింది. ఆదర్శాలు విని చాలామంది ఆవేశంతో ముందుకొచ్చి ఏదేదో చేసేద్దామీ సమాజానికి అనుకుంటూ ముందుకొస్తారు. తీరా సాంఘిక సేవా కార్యక్రమాలల్లోకి దిగాక 'మమ' గుర్తొచ్చి సమయాన్ని సర్దుబాటు చేసికోలేక సతమతమౌతారు. మంచిపని చెయ్యాలని ఉంటుంది. చేయటం కుదరదనిపిస్తుంది. మనవాళ్ళకోసం మనం చేయవలసింది మిగిలిపోయిందనిపిస్తుంది. 'మన' ను పరిమితం చేసికోవటంవల్ల వచ్చే తిప్పలివి. అలాకాక మొత్తం సమాజాన్ని 'మన' అనుకున్నప్పుడు దానికోసం నిస్సంకోచంగా చేస్తాం.

అర్జునుడు ఈసమయానికి 'స్వజన' పదం చుట్టరికాలకు పరిమితం చేశాడు కనుక విషాదంలో పడ్డాడు. దాన్ని సమాజం మొత్తానికి అన్వయించిననాడు, పరిస్థితి చక్కబడాలంటే కొందరిని సరిచేయక తప్పదని తెలిసొచ్చేది. మొత్తమే తనది కనుక దాన్ని తానే కాపాడుకోవాలి కనుక, పంటమొక్కల రక్షణకు కలుపు మొక్కల నేరేసే మంచి రైతులా దుష్టశిక్షణ చేసి వుండేవాడు.

శ్రీకృష్ణుడు చేసినదేమంటే 'స్వ' అంటే ఏమిటో దాని పరిధి ఏమిటో చెప్పాడు. అర్జునుడు కర్తవ్యోన్ముఖుడయ్యాడు అనేది గీతాఫలితాంశమనుకోండి.

కనుక నిజమైన స్వజనులు తెలియాలి. అపుడే కార్యక్షేత్రం యొక్క పరిధి, కార్యంలోని పరమార్థం అర్థమవుతాయి. అపుడు ఏపని చేస్తే శ్రేయస్కరమో తెలుస్తుంది.

******************************************************

## సర్వధారి

-- రామకృష్ణశాస్త్రి మార్తి

సర్వధారీ - సర్వధారీ
సర్వజన శుభ - ధారీ !
సర్వధారి శుభవత్సరాది
ప్రత్యూషే- అభ్యంగన స్నానం
నూత్నవస్త్ర ధారణం - నింబకుసుమభక్షణం (1)
సర్వజనామోదం - సకలశుభావహం
సర్వధారీ !!
మధ్యాహ్నే బంధుసమాగమం
మిష్టాన్నభోజనం - తాంబూలసేవనం
సాయాహ్నే పంచాంగశ్రవణం
దేవాలయ సందర్శనం
వత్సర పర్యంతం - వరప్రదాయకం
సర్వధారీ!!
సస్యశ్యామలం సర్వధారి వత్సరం
వర్షప్రపూర్ణం - సర్వధారి వర్షం
సకలజన 'శం'కరం - సర్వధారి 'సం'వత్సరం (2)
రసికజన సంతోషసాగరం
సర్వధారీ - సర్వధారీ
సర్వజన శుభ - ధారీ !!

---

1) నింబకుసుమభక్షణం - వేపపువ్వు పచ్చడి తినుట
2) 'శం' - మంగళం, శుభం
'సం' - (సమ్యక్) బాగుగా, చక్కని